## క్లుప్తంగా

### పైపులైన్ల ఏర్పాటుకు రూ. 1.16 కోట్లు మంజూరు

పీలేరు రూరల్ : పీలేరు పట్టణంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనుల్లో భాగంగా 3100 మీటర్ల తాగునీటి పైపులైన్ల ఏర్పాటుకు రూ. 1.16 కోట్లు నిధులు మంజూరైనట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రెడ్డెప్ప తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మదనపల్లె మార్గంలోని కొండారెడ్డి క్రాస్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు రోడ్డుకు ఇరువైపులా రూ. 76 లక్షలతో 2700 మీటర్ల పొడవునా తాగునీటి పైపులైన్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా చిత్తూరు రోడ్డు మార్గంలో రూ. 40 లక్షలతో 400 మీటర్లు పైపులైన్లు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. త్వరలో పనులు ప్రారంభం అవుతాయని తెలిపారు.

### ఎమ్మెల్యే నివాళి

కురబలకోట: మండలంలోని ముదివేడు గ్రామం క్రిష్టారెడ్డిగారిపల్లెకు చెందిన బీఆర్ వేణుగోపాల్ రెడ్డి (69) సోమవారం రాత్రి మృతి చెందాడు. అతడి మృతి పట్ల ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మంగళవారం మృత దేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. కుటుంబీకులను పరామర్శించి ధైర్యం చెప్పారు. వేణుగోపాల్ రెడ్డి సేవలను పార్టీ ఎప్పటికీ మరువదన్నారు.

### అన్నదానం పుణ్యకార్యం

మదనపల్లె సిటీ: అన్నదానం మహా పుణ్యకార్యమని రెడ్డి సంక్షేమ సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి కంభం నాగభూషణరెడ్డి అన్నారు. వినాయచవితిని పురస్కరించుకుని స్థానిక ఆర్టీసీబస్టాండు వద్ద రోజా హోటల్, లాడ్జి సంయుక్త ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 28 సంవత్సరాలుగా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పండగ రోజు అందరూ సుఖసంతోషాలతో ఉండాలన్న ఉద్దేశంతో అన్నదాన కార్యక్రమం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కంభం శకుంతల, రెడ్డి సంక్షేమ సంఘు నాయకులు రామమోహన్‌రెడ్డి, హేమంత్, వీరభద్రారెడ్డి, సేగు రెడ్డప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### దాడి ఘటనపై కేసు నమోదు

కలికిరి: పట్టణ పరిధిలోని క్రాస్ రోడ్డు సమీపం వగళ్ళవారిపల్లిలో ఇద్దరు యువకులు ఐదుగురిపై దాడి చేసి గాయపరచిన ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ మధుసూదనాచారి తెలిపారు. వివరాలిలా.. వగళ్ళవారిపల్లిలో సోమవారం సాయంత్రం తెల్లగుట్టహరిజనవాడకు చెందిన రాజశేఖర్, గంగాధర్‌లు గొడవపడుతున్నారు. తమ ఇంటి ముందు ఎందుకు గొడవ చేసుకుంటున్నారని రాజమ్మ వారిని అడగడంతో వారిద్దరూ కలిసి దాడి చేశారు. అడ్డుపడిన నాగిరెడ్డి, సుబ్బరామిరెడ్డి, పుల్లమ్మ, స్వర్ణ లను కూడా కట్టెలతో దాడి చేసి గాయపరచారు. వీరి కేకలు విన్న స్థానికులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకోవడంతో యువకులు పరారయ్యారు. గాయపడ్డ బాధితులను కలికిరి ప్రభుత్వాసుపత్రికి తరలించగా సుబ్బరామిరెడ్డికి తీవ్రగాయాలుండటంతో వైద్యులు తిరుపతికి రెఫర్ చేశారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, ఇద్దరు యువకులను మంగళవారం అదుపులోకి తీసుకుని తహసీల్దారు భాగ్యలత ముందు బైండోవర్ చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

### 22న నిమ్మనపల్లెలో జగనన్నకు చెబుదాం

మదనపల్లె : జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రమైన నిమ్మనపల్లెలో ఈనెల 22న జిల్లా కలెక్టర్ పీఎస్.గిరీషా ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శేషగిరిరావు తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 22వ తేదీన స్థానిక పీహెచ్‌సీ కేంద్రం ఆవరణలో ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమానికి జిల్లా అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు హాజరవుతారన్నారు. సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలను పొందడంలో ఎలాంటి ఇబ్బందులున్నా జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి హాజరై తెలియజేయవచ్చన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై మండలంలోని అన్ని గ్రామసచివాలయాల్లో సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.


### జూదరుల అరెస్ట్

పెద్దమండ్యం: కోడి పందెం ఆడుతున్న ఏడుగురు జూదరులను సోమవారం సాయంత్రం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ రామాంజనేయుడు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని బంగ్రేవుకు సమీపంలో కోడిపందెం నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి దాడులు చేయగా ఏడుగురు పట్టుబడ్డారు. వీరి నుంచి రెండు కోడిపుంజులు, రూ. 3,300 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎక్కడైనా జూదం, కోడిపందెం నిర్వహించినా, నాటుసారా తయారీ, విక్రయాలు చేసినా చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

### తప్పులు లేని ఓటర్ల జాబితాకు సహకరించాలి

తంబళ్లపల్లె: తప్పులు లేని ఓటర్ల జాబితా రూపకల్పనకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని తహసీల్దార్ శ్రీనివాసులు కోరారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయ మీటింగ్ హాల్‌లో రాజకీయ పార్టీల నాయకులు, ఏజెంట్లు, బీఎల్ఓలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు రూపొందించిన ఓటర్ల జాబితాను పరిశీలించి మార్పులు చేర్పులు ఉన్నా గుర్తించి అధికారుల దృష్టికి తేవాలన్నారు వాటిని పరిశీలించి సరిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

# మహాగణపతి.. మనసాస్మరామి


మదనపల్లె సిటీ: కైలసంలో వినాయకుడు


మదనపల్లె సిటీ: కైలసం ఎదుట రాధాకృష్ణులు

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణంలో వీధివీధిలో విఘ్నాధిపతులు కొలువుదీరారు. సోమవారం ఇంటింటా మామిడాకులు కట్టి, పూల తోరణాలతో నింపి బొజ్జ గణపయ్యకు పూజలు చేశారు. స్థానిక బెంగళూరు రోడ్డులోని సోమేశ్వరస్వామి ఆలయంలో వినాయకుని ప్రతిమ ఏర్పాటు చేసి పూజలు చేశారు. స్థానిక క్రిష్ణానగర్‌లోని శ్వేతార్క వినాయకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నీరుగట్టువారిపల్లె కాట్లాటపల్లె రోడ్డులోని వరసిద్ది వినాయకుని ఆలయంలో స్వామికి కళ్యాణోత్సవం నిర్వహించారు. మహిళలు పుట్టల్లో పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు. పట్టణంలోని 35 వార్డుల్లో యువజన సంఘం పేరిట వినాయకుని విగ్రహాలు ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. కమ్మవీధిలో నెమలి వాహనంపై వినాయకుడి విగ్రహం భక్తులను ఆకట్టుకుంది. స్థానిక నక్కలదిన్నెలో శ్రీకృష్ణదేవరాయులుగా వినాయకుడి విగ్రహం భక్తులకు అలరించింది. వివిధ ఆకారాల్లో వినాయకుని విగ్రహాలు ఏర్పాటు చేశారు. వినాయచవితి ఉత్సవ నిర్వాహకులు భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

**ఆకట్టుకున్న కైలసంలో వినాయకుడు**

ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఆర్యవైశ్యహాస్టల్‌లో కైలసంలో వినాయకుడి సెట్టింగు భక్తులను ఆకట్టుకుంది. కై లసంలో వినాయకుడు వేణువు ఊదుతూ భక్తులకు దర్శనమిచ్చారు. కైలసం ఎదుట రాధాకృష్ణులు గోపికలతో కలిసి నాట్యం చేస్తున్న విగ్రహాలు కూడా ఆకట్టుకున్నాయి. కైలసం ఎదుట శివలింగం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఓంప్రకాష్, యువజన అధ్యక్షులు ఎల్లంపల్లి ప్రశాంత్, యువజన సంఘనాయకులు పాల్గొన్నారు.

**రక్తదాతగా వినాయకుడు**

స్థానిక నీరగట్టువారిపల్లె కాట్లాటపల్లెరోడ్డులో రక్తదాత వినాయకుడి విగ్రహం ఏర్పాటు చేశారు. అందరిని ఆలోచింపజేసే విధంగా ఏర్పాటు చేశారు. వినాయకుడు రక్తదానం చేస్తుండటం, తల్లిదండ్రులు శివుడు, పార్వతిలు దగ్గరుండటం, డాక్టర్‌గా ఎలుకను ఏర్పాటు చేశారు. అత్యవసర సమయంలో రక్తదానం చేయాలంటూ సందేశం విధంగా విగ్రహం ఏర్పాటు చేసినట్లు వివేక ఆశయ ఫౌండేషన్ నిర్వాహకులు భాను తెలిపారు.

**వినాయకుడి సేవల్లో ఎమ్మెల్యే నవాజ్‌బాషా**

వినాయచవితి పండుగ పురస్కరించుకుని ఎమ్మెల్యే ఎం.నవాజ్‌బాషా స్థానిక ఆర్యవైశ్య యువజన సంఘం ఏర్పాటు చేసిన వినాయకుని దర్శించుకున్నారు. అమ్మచెరువుమిట్ట, బసినికొండ తదితర ప్రాంతాల్లో వినాయకుని దర్శించుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు జింకా చలపతి, నూర్ ఆజామ్, ఆర్యవైశ్య సంఘు నాయకులు ఓంప్రకాష్, పాండు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

**పీలేరులో అంబరాన్నంటిన చవితి వేడుకలు**

పీలేరు : పీలేరులో వినాయక చవితి సంబరాలు అంబరాన్నంటాయి. పట్టణం, గ్రామం తేడా లేకుండా వినాయక నామస్మరణలో ఊరూ వాడా మునిగి తేలాయి. పీలేరు మండలంలో దాదాపు 150 కేంద్రాల్లో లంబోధరుడిని కొలువు దీర్చారు. ఒక్క పీలేరు పట్టణంలోనే వందకుపైగా విగ్రహాలు ఏర్పాటు చేశారు. విభిన్న ఆకృతులతో మండపాల్లో కొలువుదీరిన విఘ్నేశ్వరుడు భక్తులకు దర్శనమిచ్చాడు. వివిధ రంగుల విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకతమైన వినాయక మండపాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి అయా కేంద్రాల నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. సోమ, మంగళవారం వినాయకుడిని దర్శించుకోవడానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. దీంతో పట్టణంలో ఎటు చూసినా సందడి నెలకొంది.

**నిమ్మనపల్లెలో..**

నిమ్మనపల్లె : మండలంలోని పలుచోట్ల వినాయక విగ్రహాలను ఏర్పాటుచేసి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. మండపాల వద్ద నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటుచేశారు. స్థానిక పోలీసులు మండపాల వద్ద గస్తీ నిర్వహించారు. మహిళలు పెద్దసంఖ్యలో గ్రామసమీపంలోని నాగదేవతల విగ్రహాలకు పూజలు చేసి, పుట్టలో పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు.

**కేవీపల్లెలో..**

కేవీపల్లె: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం ఉదయం గణేష్ విగ్రహాలకు భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. గణేష్ విగ్రహాలను వివిధ రకాల పుష్పాలు, మామిడి తోరణాలు, అరటి గెలలతో శోభాయమానంగా అలంకరించారు. గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాదాలు పంచిపెట్టారు. మంగళవారం విగ్రహాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. గర్నిమిట్టలో నిర్వహించిన ఉత్సవాల్లో జెడ్పీటీసీ గజ్జెలశృతి, నాయకులు గజ్జెల శీన్ రెడ్డి, హరిబాబు, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

**వాల్మీకిపురంలో..**

వాల్మీకిపురం: వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకొని మంగళవారం విఘ్నాలను తొలగించి వరాలను ప్రసాదించే వినాయకుడికి ప్రజలంతా భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. పట్టణంలోని తోటవీధి, ఆర్టీసీ బస్టాండ్, బజారువీధి, గాంధీపేట, ఎన్టీఆర్ కాలనీ, కొత్తపేటవీధి, జెట్టిపాళ్యెంవీధి, ఫింగాని ఫ్యాక్టరీ తదితర ప్రాంతాలలో భారీ ఎత్తున పెద్ద వినాయకుడి విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్థానిక కోనేటివీధిలోని కామేశ్వర స్వామి ఆలయంలో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ విఘ్నాలన్ని తొలిగిపోయి సంవృద్ధిగా వర్షాలు కురిసి నియోజకవర్గంలో పంటలు బాగా పండాలని సిద్ధి వినాయకుడిని కోరుకున్నట్లు తెలి పారు.

**భక్తిశ్రద్ధలతో పూజలు**

ములకలచెరువు: మండల ప్రజలు వినాయకచవితి పండుగను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో వినాయకుడి విగ్రహాలను ప్రతిష్ఠించారు. మహిళలు, పిల్లలు వినాయకుడి విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామాల్లో ఎన్నడూ లేని విధంగా పండుగ వాతావరణం నెలకొంది. సోమ, మంగళవారం ఆలయాలు సైతం భక్తులతో కిటకిటలాడాయి.

**రామసముద్రంలో..**

రామసముద్రం: మండలంలో ఊరూరా వినాయకుని విగ్రహాలు భారీగా ఏర్పాటు చేశారు. బొజ్జ గణపయ్యలకు భక్తిశ్రద్ధలతో పూజించి, యువకులు గ్రామీణ ప్రాంతాల గ్రామ నడిబొడ్డుల్లో వేద పండితులచే , వేదమంత్రోచ్చరణలతో పూజలు నిర్వహించారు. అలాగే ఇళ్లలో ప్రతి ఒక్కరు బొజ్జ గణపయ్య చిట్టి విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు చేశారు.

**ఉండ్రాలయ్యా..కాపాడయ్యా..**

తంబళ్లపల్లె: వినాయక చవితి పండగ సందర్భంగా ఊరూరా వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు. తంబళ్లపల్లెలో పాత కళాశాల మైదానంలో గణేష్ యూత్ సభ్యులు భారీ వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. సోమవారం రాత్రి అనంతపురం జిల్లా లేపాక్షికి చెందిన తోలుబొమ్మలాట కళాకారులు గ్రామీణ పల్లె సుద్దులు తోలుబొమ్మలాటతో ప్రజలను రంజింపజేశారు. మంగళవారం రాత్రి చెన్నైకు చెందిన మెజీషియన్ తన మ్యాజిక్ షోతో అలరించారు.

**కలికిరిలో..**

కలికిరి: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు వినాయకుని ప్రతిమలను మండల పరిధిలో వాడ వాడలా ప్రతిష్టించారు. సోమవారం ఉదయం విగ్రహాలను ప్రతిష్టించి ప్రత్యేక పూజలు చేశారు. తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. విగ్రహాల వద్ద నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మండలంలోని కె.రెడ్డివారిపల్లి గ్రామం కె.కొత్తపల్లిలో వినాయచవితి సందర్భంగా మంగళవారం వినాయకుని లడ్డూ, స్వామి పాదాల వద్ద నుంచి నగదు, పంచె, జాకెట్‌లకు బహిరంగ వేలం నిర్వహించారు. వీటిలో లడ్డూ రూ.13వేలు, మిగిలినవి రూ.14550 ధర పలికాయి.

**కలకడలో..**

కలకడ : వినాయక చవితి సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల్లో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. వినాయక విగ్రహాల వద్ద పచ్చని చలువ పందిరి ఏర్పాటు చేసి రంగురంగుల విద్యుత్ దీపాలు, పూలతో అలంకరించి స్వామివారికి ఇష్టమైన పండ్లు, గెరిక, మిఠాయిలను అందజేశారు.


శ్రీకృష్ణదేవరాయలుగా వినాయకుడు


నిమ్మనపల్లె : కొండయ్యగారిపల్లెలో ..


వాల్మీకిపురం: తోటవీధిలో వినాయకుడు


రామసముద్రం: గుంతయంబాడిలో..






ఎమ్మెల్యే నవాజ్‌బాషాను సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘు నాయకులు, పీలేరు : జర్నలిస్టు కాలనీలో గణనాథుడు, కేవీపల్లె : గర్నిమిట్టలో..., కలకడలో ఏర్పాటు చేసిన భారీ వినాయక విగ్రహం, తంబళ్లపల్లెలో గణేష్ విగ్రహం వద్ద యూత్ సభ్యులు

# జగనన్న ఆరోగ్య సురక్షను విజయవంతం చేద్దాం

మదనపల్లె : రాష్ట్రప్రజల ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు, ఆరోగ్య సంబంధిత పథకాలపై అవగాహన పెంచేందుకు ప్రభుత్వం సెప్టెంబర్ 30వ తేదీ నుంచి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీపీఓ ధనలక్ష్మి కోరారు. మంగళవారం మండలంలోని కోళ్లబైలు–2 పంచాయతీలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆరోగ్య సురక్ష సర్వేపై ఏఎన్‌ఎం, వలంటీర్లు, ఆశాకార్యకర్తలకు పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా డీపీఓ ధనలక్ష్మి మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు మరింత మెరుగైన ఆరోగ్యసేవలు అందించేందుకు సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెడుతున్నారన్నారు. కార్యక్రమంలో భాగంగా ప్రతి సచివాలయ పరిధిలో ఏఎన్‌ఎం, వలంటీర్లు తమ పరిధిలో ఉన్నటువంటి ఇళ్లకు వెళ్లి ప్రజల ఆరోగ్యస్థితిగతులను తెలుసుకుని, అవసరమైతే వారికి కావాల్సిన పరీక్షలు చేస్తారన్నారు. ఆరోగ్యసమస్యలు ఉన్నవారిని యాప్‌లో నమోదుచేయాలన్నారు. ఎవరికైతే డాక్టర్‌తో కన్సల్టేషన్ అవసరం ఉందో వారిని సెప్టెంబర్ 30 నుంచి ప్రతిరోజు, ప్రతి మండలంలో ఏదో ఒక వైఎస్సార్ విలేజ్‌క్లినిక్ పరిధిలో నిర్వహించే క్యాంపు రోజు డాక్టర్ వద్దకు తీసుకురావాలన్నారు. ప్రతి ఆరోగ్యశిబిరంలో రోగులకు చికిత్స చేసేందుకు అవసరమైన వైద్య పరికరాలను ఉంచడంతో పాటు, 105 రకాల మందులను ఉచితంగా అందుబాటులో ఉంచనున్నట్లు చెప్పారు. ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల నుంచి ఒక స్పెషలిస్ట్ డాక్టర్ హెల్త్‌క్యాంపునకు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భానుప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు బండి మనోహర్, సచివాలయ సిబ్బంది, ఏఎన్‌ఎం, ఆశాకార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.


జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను పరిశీలిస్తున్న డీపీఓ ధనలక్ష్మి

# ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

పెద్దమండ్యం: జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఎండీసీ అధ్యక్షుడు గుర్రం రమేష్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో పక్కాగృహాల నిర్మాణంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. వివిధ దశలలో ఉన్న నిర్మాణాల గురించి పంచాయతీల వారీగా సమావేశంలో బిల్లుల చెల్లింపులపై ఆరా తీశారు. ఇంటి నిర్మాణాలు పూర్తి చేసిన లబ్దిదారులకు సకాలంలో బిల్లులు చెల్లించాలని ఆయన కోరారు. అలాగే అర్హత ఉన్న వారికి పక్కాగృహాలు మంజూరు కోసం ఉన్నతాధికారులకు నివేదించాలన్నారు. ఆధార్, వ్యక్తుల పేర్లు తప్పులు ఉంటే సరిదిద్దుకొనే అవకాశం ఉన్నట్లు డీఈ శ్రీహరి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీధర్‌రావు, వైస్ ఎంపీపీ టి జయచంద్రారెడ్డి, సర్పంచ్‌లు సోదనపల్లె బాషా, మొలక బయ్యారెడ్డి, జింకా విశ్వనాథ కంటి విశ్వనాథరెడ్డి, ఎంపీటీసీ జయరాం పాల్గొన్నారు.

# మదరసా నిర్మాణ స్థల వివాదంపై డీఎస్పీ విచారణ

కలికిరి: మండలంలోని గుట్టపాళెం గ్రామంలో కలికిరికి చెందిన పఠాన్ సయ్యద్ జాఫర్ మదరసా నిర్మాణానికి ఏర్పాటు చేశాడు. గమనించిన స్థానికులు అక్కడ ఎలాంటి అనుమతులు లేకుండా మదరసా నిర్మాణం చేపట్టకూడదని, స్థానికులు తహసీల్దారు జే.భాగ్యలతకు ఫిర్యాదు చేశారు. విచారించిన తహసీల్దారు నిర్మాణాలు ఆపాలని ఆదేశించారు. అయితే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రాయచోటి డీఎస్పీ ఎస్.మహబూబ్ బాషా మంగళవారం కలికిరికి చేరుకుని మదరసా నిర్మాణం చేపట్టిన పఠాన్ సయ్యద్ జాఫర్‌ను, స్థానిక సర్పంచ్ ఆర్.వెంకటరెడ్డి, చుట్టు పక్కల గ్రామస్తులను విచారించారు. చుట్టు పక్కల గ్రామస్తుల నుంచి అభ్యంతరాలు వచ్చినందున నిర్మాణాలు చేపట్టకూడదని తెలియజేశారు.

# కమనీయం.. శ్రీలక్ష్మీ నరసింహుడి కల్యాణం

గుర్రంకొండ: మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి కల్యాణోత్సవం కనుల పండుగగా జరిగింది. మంగళవారం స్వాతి నక్షత్రం కావడం, ఇదేరోజు స్వామివారి జన్మదినం కావడంతో పాటు శ్రావణ మాసం కావడంతో టీటీడీ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా మూలవర్లకు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రంగురంగుల పుష్పాలతో స్వామివార్లను అలంకరించిన తీరు అందరినీ ఆకట్టుకొంది. ముత్యాల తంబ్రాలతో స్వామివారి పెళ్లివేడుక నిర్వహించారు.


స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

# అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పాలన

వాల్మీకిపురం: అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కుందేళ్లవారిపల్లి, పుల్లేటిచెరువుపల్లికి మంజూరైన రోడ్లకు భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ కుందేళ్లవారిపల్లికి రూ.1.55 లక్షలు, పుల్లేటిచెరువుపల్లికి రూ.2.52 లక్షలతో రోడ్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఎన్నో ఏళ్లుగా ఈ గ్రామాలకు రోడ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడేవారని, ప్రభుత్వం నియోజకవర్గంలో రోడ్లు లేని గ్రామాలకు రోడ్లు మంజూరు చేసిందన్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి చొరవతో నూతన రోడ్లు మంజూరు అయ్యాయన్నారు. నవరత్నాల పథకాలతో ప్రతి కుటుంబంలో లబ్ధి చేకూరిందన్నారు. ప్రభుత్వ పథకాలు ఎలా అందుతున్నాయో ఆరా తీస్తూ ఇంకా ప్రజల సమస్యలపై తెలుసుకుంటున్నామని అన్నారు. సంక్షేమ పథకాలు పొందిన లబ్ధిదారులు ప్రభుత్వ పని తీరుపై ఎంతో సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థతో ప్రజల వద్దకే పాలనను ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తీసుకొచ్చారన్నారు. కార్యక్రమంలో నీళ్లభాస్కర్, కేశవ రెడ్డి, శ్రీధర్‌రాయల్, సురేష్ రెడ్డి, మోహన్ రెడ్డి, ఓరుగంటి రమేష్, సుధాకర, వెంకట్రమణ, కిరణ్ కుమార్, లక్ష్మినారాయణ రెడ్డి, ఫారుఖ్, రాయుడు, షాహెద్, ఆనంద, తదితరులు పాల్గొన్నారు.


భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే చింతల

# ప్రజా సమస్యలు పరిష్కరించాలి

తంబళ్లపల్లె: పల్లెబాటలో గుర్తించిన ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం తంబళ్లపల్లెలో అధికారులు, ప్రజాప్రతినిధులతో గ్రామాలవారి సమీక్ష నిర్వహించారు. పల్లె బాటలో ప్రజల నుంచి వచ్చిన సమస్యలను ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పరిష్కరించాలన్నారు. ఎవ్వరూ నిర్లక్ష్యం చేయరాదన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాల అందేలా చూడాలన్నారు. సమీక్షలో ఎంపీడీఓ సురేంద్రనాథ్, హౌసింగ్ డీఈ శ్రీధర్ రావు, ఆర్‌డబ్ల్యూస్ డీఈ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

### సామాజిక సేవా కార్యక్రమాలు అభినందనీయం

పెద్దతిప్పసముద్రం: సామాజిక సేవా కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు భాగస్వాములు కావడం అభినందనీయమని ఎంపీపీ మహమూద్, జెడ్పీటీసీ శివన్న, రాష్ట్ర ఐటీ వింగ్ జాయింట్ సెక్రటరి మొరవపల్లి వెంకట శివ, జావీద్ అన్నారు. మండలంలోని టి.సదుంకు చెందిన వలంటీర్ జయచంద్ర జ్ఞాపకార్థం రెండు రోజుల నుంచి ఓపెన్ టెన్నీస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. క్రీడల్లో ప్రతిభ చాటిన టి సదుంకు చెందిన ఏ టీంకు మొదటి బహుమతిగా సోషల్ మీడియా జిల్లా కో కన్వీనర్ రవిచంద్రారెడ్డి రూ.22,222లు, టి.సదుం బీ టీంకు స్థానిక ఉప సర్పంచ్ పీఎస్ మధు రూ.11,111లు, మూడవ బహుమతి సాధించిన వడ్డిపల్లి టీంకు స్థానిక ద్వారకన్న టీం యువ నాయకుడు నవీన్‌కుమార్‌రెడ్డి రూ.5,555ల నగదును అందించారు. సదరు మొత్తాన్ని ప్రజా ప్రతినిధుల ద్వారా అందజేశారు. ఇదే రామాపురానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బొమ్మే వెంకట్రమణ క్రీడాకారులకు, ప్రేక్షకులకు ఉచిత భోజన సౌకర్యం కల్పించారు.

### ఎస్సీ వర్గీకరణే ధ్యేయం

పీలేరు రూరల్ : ఎస్సీ వర్గీకరణే ధ్యేయమని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మున్నంగి నాగరాజు అన్నారు. మంగళవారం పీలేరులో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షెడ్యూలు కులాల వర్గీకరణకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అలుపెరగని పోరాటం చేశారని పేర్కొన్నారు. పార్లమెంట్ సమావేశంలో ఎస్సీ వర్గీకరణ బిల్లులకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. బీజేపీ ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకోవడానికి ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

### జిల్లా ఆస్పత్రికి రూ.20 లక్షల విలువైన వైద్యపరికరాలు

మదనపల్లె : స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి రూ.20 లక్షల విలువచేసే అధునాతన వైద్యపరికరాలు వచ్చినట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్.పద్మాంజలిదేవి, బయోమెడికల్ ఇంజినీర్ అలేఖ్య తెలిపారు. మంగళవారం వారు మీడియాతో మాట్లాడుతూ.. నోటికేన్సర్‌ను గుర్తించేందుకు ఉపయోగించే రూ.7లక్షల విలువైన వెల్ స్కోప్, రూ.2లక్షల విలువైన ఈసీటీ స్కిములేటర్, అదేవిధంగా రూ.11.70 లక్షల విలువచేసే షాకర్ డిఫీమ్ ట్రినర్ వచ్చాయన్నారు. ఈ యంత్రపరికరాలతో వైద్య విద్యార్థులు శిక్షణ పొందుతారన్నారు. వైద్యకళాశాలకు అవసరమైన ఈ పరికరాలు ఆస్పత్రిలో రోగులకు, వైద్యవిద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటాయన్నారు.

### ఆయుష్మాన్ భవతో ఖరీదైన వైద్య సేవలు

తంబళ్లపల్లె: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు పరుస్తున్న ఆయుష్మాన్ భవ పథకం ద్వారా గ్రామీణ పేదలకు ఖరీదైన మెరుగైన వైద్య సేవలు అందిస్తామని మండల వైద్యాధికారి సభా ఫాతీమా తెలిపారు. మంగళవారం సీహెచ్‌సీ ప్రభుత్వ ఆసుపత్రిలో ఆరోగ్యమేళా జరిగింది. ఆయుష్మాన్‌భవ గురించి వివరించారు. గర్భిణులు, ప్రసవ సమస్యలు, చిన్నపిల్లల సమస్యలు, గొంతు, ముక్కు, మానసిక సమస్యలపై ప్రత్యేక డాక్టర్లచే పరీక్షలు నిర్వహించి ఉచితంగా వైద్య చికిత్సలు అందించడం జరుగుతుందన్నారు. ఆపరేషన్లు అవసరమైన వారికి రెఫర్ చేసి కార్పోరేట్ ఆసుపత్రులలో వైద్య చికిత్సలు ఉచితంగా నిర్వహిస్తారన్నారు.